

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 25.0



శేషవాహనంపై ఊరేగిన శేషాచలవాసుడు

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవారికి ఉగాది ఉత్సవం ఆదివారం రాత్రి అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. తొలుత ఉభయదేవేరులు, గోదాదేవితో కలిసిన శ్రీవారి మూర్తులను వెండి శేషవాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, సన్నాయివాయిద్యాలు నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా శ్రీవారు కొలువుదీరిన వాహనం ఉగాది మండపం వద్దకు తరలివెళ్లింది.







భీమవరం విష్ణు కాలేజీలో గోపూజ నిర్వ హిస్తున్న కలెక్టర్ నాగరాణి, ప్రముఖులు.. భక్తులతో కిటకిటలాడిన మావుళ్లమ్మ ఆలయం (ఇన్‌సెట్‌లో) అమ్మవారు

ఉగాది ఉత్సవం

- భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో అధికారిక కార్యక్రమం
- పంచాంగ శ్రవణం.. పండితులకు సత్కారం
- జిల్లాలోని ఆలయాల్లో భక్తుల రద్దీ



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు



పంచాంగ శ్రవణం చేస్తున్న వేద పండితుడు ఈమని రామచంద్ర ఘనాపాఠి

భీమవరం టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పచ్చడిలో తీపి, చేదు, పులుపు, ఉప్పు, కారం, వగర ఎలా అయితే ఉంటాయో మన జీవితంలో వచ్చే మంచి, చెడులను సమానంగా తీసుకుని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకాంక్షించారు. ఆదివారం విష్ణు ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత కలెక్టర్‌కు వేద పండితులు, అర్చకులు స్వాగతం పలుకగా, గోమాతకు ఆమెతో పాటు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతిని వెలిగించి ఉగాది వేడుకలు ప్రారంభించి ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా అభివృద్ధి చేసేందుకు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నరన్నారు. విశ్వావసు నామ సంవత్సరంలో అన్నివర్గాలకు అనుకూలంగా ఉందని ఈమని రామచంద్రాస్వామి పంచాంగ శ్రవణం వినిపించారు. పలువురు కవులు కవి సమ్మేళనం నిర్వహించి ఆహుతులను ఉత్సాహపరిచారు. భీమవరానికి చెందిన డి.రామనాగేశ్వర రావు, పంపన సాయిబాబు, చిత్రావూరి లక్ష్మీనారాయణ, కాళ్లకూరి శర్మ వేదికపై వారి చూపిన సాహిత్య పతిమ ఆకట్టుకున్నాయి. చివరిగా కవులను, కళాకారులను, సంఘ సేవకులను మెమెంటో, సర్టిఫికెట్ను అందజేసి ఘనంగా సన్మానించారు. పలు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అన్నీ అనుకూల ఫలితాలే..

జిల్లాలోని ఆలయాలతో పాటు పలు చోట్ల రాజకీయ పార్టీ నేతలు కూడా పంచాంగ శ్రవణ కార్యక్రమాలను ఏర్పాటుచేసి పండితులను సత్కరించారు. విశ్వావసు నామ సంవత్సర ఫలాలను పండితులు తెలియజేశారు. ఈ ఏడాది రాజు సూర్యుడు అని, మంత్రి చంద్రుడు కావడంతో అన్నింటా శుభాలు జరుగుతాయని పంచాంగకర్తలు పేర్కొన్నారు. పంటలు సంవృద్ధిగా పండుతాయని, వర్షాలతో పాడిపంటలు బాగుంటాయన్నారు. ఈ ఏడాది ప్రతి రాశి వారికి శుభాలే జరుగుతాయన్నారు. కొన్ని ఒడిదుడుకులు ఏర్పడినా సర్దుకుంటా యన్నారు.

వాడవాడలా పంచాంగ శ్రవణాలు

జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో ఆదివారం పండితుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాలను నిర్వహించారు. పంచారామ క్షేత్రాలైన గునుపూడి సోమేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివార్లను ప్రత్యేక అలంకరణ చేశారు. భీమవరంలోని మావుళ్లమ్మ ఆలయానికి భక్తులు తరలిరావడంతో కిటకిటలాడాయి. మావుళ్లమ్మ ఆలయంలో వారణాశి లక్ష్మీ నర్సింహమూర్తిచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో రాత్రి స్వామివారికి సహస్రదీపాలంకరణ నిర్వహించారు. పలు దేవాలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు.



ప్రతి గింజా కొంటాం

- జిల్లాలో ఆరు లక్షల టన్నుల లక్ష్యం
- రెండు రోజుల వ్యవధిలోనే సొమ్ములు
- ఖరీఫ్‌లో విజయవంతంగా అమలు
- రబీ సాగులోనూ అదే బాట.. 348 కొనుగోలు కేంద్రాలు

రబీలో ప్రణాళిక సిద్ధం చేసిన ప్రభుత్వం

(భీమవరం-ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే రబీ సాగులో అత్యధికంగా ధాన్యం ఉత్పత్తి అయ్యే జిల్లా పశ్చిమ గోదావరి. రొయ్య, చేపల సాగు అధికం కావడంతో వరిసాగు తగ్గింది. లేదంటే మరింత ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్న జిల్లా. అయినప్పటికీ ప్రస్తుత రబీ సీజన్‌లో ఆరు లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేసింది. పౌర సరఫరాల కార్పొరేషన్ ఆ దిశగా కసరత్తు ప్రారంభించింది. డివిజన్‌ల వారీగా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో ధాన్యం విక్రయించడానికి రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నిబంధనలను సడలించారు. గడిచిన ఖరీఫ్‌లో విజయవంతంగా అమలు చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన విధానం వల్ల ఖరీఫ్‌లో రైతులు సునాయాసంగా ధాన్యాన్ని అమ్ముకోగలిగారు. రెండు రోజుల వ్యవధిలోనే రైతు ఖాతాల్లో సొమ్ములు జమ అయ్యాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో అదే తరహాలో సొమ్ములు జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో రెవెన్యూ డివిజన్‌ల వారీగా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. జిల్లా పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్ శివరామప్రసాద్ డివిజన్‌ల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. సిబ్బందికి సాంకేతిక శిక్షణ ఇస్తున్నారు.

348 కొనుగోలు కేంద్రాలు సిద్ధం

జిల్లాలో 348 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయనున్నారు. సహకార సంఘాలు పర్యవేక్షించనున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలోనే తాడేపల్లిగూడెంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో రబీ ధాన్యం అందుబాటులోకి వచ్చాయి. తూర్పుగోదావరి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. డెల్టా ప్రాంతంలో ఏప్రిల్ మూడో వారానికి వరికోతలు పూర్తి కానున్నాయి. అదేనెలలో కొనుగోళ్లు పూర్తిచేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం విక్రయించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఫలితంగా రైతు కష్టాలు తొలగిపోయాయి. ముందుగానే మిల్లర్ వద్దకు వెళ్లి సంచులను తెచ్చుకుంటున్నారు. ఒబ్బిడి అయిన వెంటనే మిల్లుకు తరలిస్తున్నారు. అక్కడ నమోదైన తక్షణమే రైతు ఖాతాల్లో సొమ్ములు జమ అయిపోతున్నాయి. గత ప్రభుత్వంలో తూకం వేసిన తర్వాత ఏ మిల్లుకు కేటాయిస్తారో తెలిసేది. ఒకవైపు సంచుల ఇబ్బంది, మరోవైపు మిల్లు కేటాయింపులో స్పష్టత లేకపోవడం వంటి కారణాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు.

నిబంధనలు సడలించిన ప్రభుత్వం

వైసీపీ పాలనలో ఒక మండలంలో ఉత్పత్తి అయ్యే ధాన్యం మరో మండలంలోని మిల్లుకు తరలించేవారు. వైసీపీ నేతల సిఫారసు ఉన్న మిల్లులకు అధికంగా ధాన్యం తరలిపోయాయన్న విమర్శలు వెల్లువెత్తాయి. రైతులకు సకాలంలో సొమ్ములు జమయ్యేవి కావు. రైతుపై ఆధారపడ్డ వ్యాపారాలన్నీ కుదేలయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిబంధనలను సడలించింది. మిల్లును రైతే ఎంపిక చేసుకుంటున్నారు. సొమ్ములు సక్రమంగా జమ అయిపోతున్నాయి. తాజాగా రబీలోనూ సొమ్ములు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.



భీమవరం వీరమ్మ పార్కు వద్ద విద్యుత్‌కాంతులతో పెద్ద మసీదు

నేడే రంజాన్

ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ సోమవారం పురస్కరించుకుని జిల్లాలోని మసీదులు విద్యుత్ కాంతులతో ముస్తాబయ్యాయి. ఈనెల ఒకటో తేదీ నుంచి ముస్లింలు ఉపవాస దీక్షలు చేపట్టారు. నెలరోజులపాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం నెలవంక దర్శనం ఇవ్వడంతో ఉపవాస దీక్షలు విరమించారు. ఈ సందర్భంగా మసీదుల వద్ద భారీ టెంట్లు వేసి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు.

ఏలూరు జైలులో రిమాండు ఖైదీ ఆత్మహత్య

ఇద్దరి మహిళా ఉద్యోగుల సస్పెన్షన్.. విచారణ చేపట్టిన ఏలూరు ఆర్డీవో

7



భీమవరం ప్రత్యేక కౌంటర్‌లో ఆస్తిపన్ను కట్టించుకుంటున్న అధికారులు

ఒకరోజు ఆస్తి పన్ను వసూళ్లు రూ.68 లక్షలు

- నేడు కూడా మునిసిపాల్టీల్లో ప్రత్యేక కౌంటర్లు కొనసాగింపు

భీమవరంటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగుల సందర్భంగా వరుసగా రెండు రోజులు సెలవులు వచ్చిన నేపథ్యంలో మునిసిపాల్టీల్లో ఆస్తి పన్ను వసూళ్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఆదివారం రూ.68 లక్షలు మాత్రమే వసూళ్లయింది. ఉగాది పండుగ ప్రభావం వల్ల వసూళ్ల తగ్గాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆస్తిపన్ను చెల్లింపునకు సోమవారంతో గడువు ఈ ఆర్థిక సంవత్సరానికి ముగుస్తుంది. ఏప్రిల్ ఒకటి నుంచి వడ్డీ జత కానుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను చెల్లింపుదారులకు వడ్డీలో 50 శాతం మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గడువు సోమవారంతో ముగుస్తోంది. వడ్డీ మినహాయింపు వల్ల ఆస్తిపన్ను బాగానే వసూళ్లవుతాయనే ఆశతో అధికారులు ఉన్నారు. మునిసిపాలిటీల వారీగా ఆదివారం వసూళ్లయినవి ఇలా.. భీమవరం-రూ.20 లక్షలు, తాడేపల్లిగూడెం- రూ.9 లక్షలు, తణుకు -రూ.14 లక్షలు, పాలకొల్లు-రూ.13 లక్షలు, నరసాపురం-రూ.9 లక్షలు, ఆకివీడు-రూ.3 లక్షలు చొప్పున వసూళ్లయ్యాయి. 31న వసూళ్లు కావాల్సినవి రూ.6.98 కోట్లు ఉన్నాయి. సోమవారంతో ఎంత లక్ష్యం వసూళ్లు నెరవేరుతాయో తెలుస్తుంది.

సహకారం అవినీతిమయం

అవినీతిలో కూరుకుపోతున్న సహకార సంఘాలు

- తేతలి సొసైటీలో రైతులకు ఇంకా రూ.61 లక్షలు చెల్లించాలి
- దువ్వ సొసైటీలో బకాయి చెల్లింపు సొమ్ములతో ఉద్యోగి పరార్
- అవగాహన లేని పాలకవర్గంతో ఇబ్బందులు.. రైతులకు తీవ్ర నష్టం



తేతలి సొసైటీ భవనం

తణుకు రూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత రైతులకు వ్యవసాయ అవసరాల కోసం పరస్పరం సహకారం కోసం ఏర్పడిన సహకార సంఘాలు ప్రస్తుతం అవినీతిలో కూరుకుపోయి రైతులకు తీరని నష్టాలకు గురిచేస్తున్నాయి. సుమారు వందేళ్లకు పైగా చరిత్ర వున్న దేశంలోని సహకారం రంగం కొన్ని గ్రామాల్లోని సొసైటీలకు సరైన నాయకత్వం లేకపోవడంతో ఉద్యోగుల ఇష్టారాజ్యంగా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల కాలంలో పలు కారణాలతో రైతుల కోసం, రైతుల ద్వారా ఎన్నికైన సంఘాలలో రైతుల సొమ్ములు పక్కదారి పట్టి రైతుల సొమ్ములు కొందరు స్వార్థపరులు కాజేసిన ఘటనలు వెలుగు చూస్తున్నాయి. తణుకు మండలం తేతలి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం 2017-18 మధ్య కాలంలోనే సుమారు 4.64 కోట్ల నిధుల దుర్వియోగం జరిగి రైతులను, డిపాజిట్లదారులను నిండా ముంచేశారు. డిపాజిట్‌దారులకు తమ సొమ్ములు తిరిగి ఇచ్చేందేందుకు ఇప్పటివరకు పూర్తి కాలేదు. ఇంకా రూ. 61 లక్షలు చెల్లించాల్సి వుంది. ఒకప్పుడు జిల్లాలోని మెరుగైన సేవలందిస్తూ లాభాల బాటలోవున్న ఈ కుంభకోణంతో తేతలి సొసైటీ పూర్తిగా నష్టాల్లో కూరుకుపోయింది. ఈ దుర్వినియోగంలో అప్పటి పాలకవర్గం, కార్యదర్శులేనని విచారణలో తేలింది. మండలంలోని దువ్వ గ్రామం సొసైటీలో పనిచేసే స్టాఫ్ అసిస్టెంట్ రామహనుమకుమార్ రైతులు సొసైటీకి చెల్లించాల్సిన రుణ బకాయిలను తన ఫోన్‌పేకు జమ చేయించుకుని లక్షల రూపాయలను సొసైటీకి చెల్లించకుండా గ్రామం విడిచి పరారయ్యాడు. ఈమేరకు రైతులు చెల్లించిన బకాయిలు సొసైటీ ఖాతాల్లో ఇంకా బకాయిలుగానే మిగిలిపోగా, రైతులు సొమ్ములుతో పరారైన ఉద్యోగి నుంచి సొమ్ములు రాబట్టేందుకు ఎన్ని రోజులు పడుతుందోననే ఆందోళన రైతుల్లో నెలకొంది.

అవగాహన లేని సభ్యులతో ఇబ్బందులు

సొసైటీలకు పాలకవర్గం సభ్యులుగా ఎన్నికైన వ్యక్తులకు కనీస విద్యార్హతలు, సహకార రంగంపై కనీస అవగాహన లేకపోవడం, సంఘ ఆర్థిక వ్యవహారాల పట్ల అవగాహన లేనివారు పాలకవర్గ సభ్యులుగా ఎన్నికకావడం వల్ల కొన్ని సొసైటీలలో ఉద్యోగుల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. అవగాహన లేని పాలకవర్గ సభ్యుల కారణంగా ఉద్యోగులె తమ ఇష్టారాజ్యంగా సొసైటీ నిధులను గోల్‌మాల్ చేస్తున్నారనే విమర్శలున్నాయి.

సకాలంలో పాలకవర్గ ఎన్నికలు జరగాలి

గ్రామాల్లోని సొసైటీలకు నిర్ణీత కాలం పూర్తైన వెంటనే ఎన్నికలు నిర్వహించకపోవడం కారణంగా రైతులకు అవసరమైన సేవలందించడంలో కాలయాపన జరుగుతుంది. ముఖ్యంగా రైతులకు డివిడెండ్ల పంపిణీ, రుణ పరిమితి పెంచడం, పురుగు మందులు, ఎరువుల అమ్మకాల నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతుందని విమర్శలు వున్నాయి. పైడిపర్రు సొసైటీకి రెండు పంటల ద్వారా రూ.30 లక్షలు ఆదాయం వస్తుందని, దీనిని చూపించి సిబ్బంది తమ వేతనాలు పెంచుకుంటు న్నారు తప్ప రైతులకు రుణ పరపతి స్కేలు పెరగడం లేదు.

సిబ్బందికి బదిలీలు ఉండాలి

సహకార సంఘాల్లో పనిచేసే సిబ్బందికి బదిలీలు లేకపోవడం, పాలకవర్గం ఇష్టానుసారం సంఘ కార్యదర్శులను నియమించుకోవడం వల్ల కొందరు జీవితకాల కార్యదర్శులుగా కొనసాగుతున్నారు. దీనివల్ల అవినీతి జరుగుతుంది. మిగిలిన ఉద్యోగుల మాదిరిగానే బదిలీలు ఉండాలి.

- వల్లూరి రామ్మోహనరావు, మాజీ వైఎస్ ఎంపీపీ, వేల్పూరు.



స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచాలి



రైతులకు సొసైటీల ద్వారా అందించే రుణాలను పెంచాలి. ప్రస్తుతం బ్యాంక్‌లు అడంగల్ పాస్ బుక్ ఆధారంగా రుణాలు ఇస్తున్నారు. బ్యాంక్‌లు ఎకరానికి రూ. 1.20 లక్షలు రుణాలు ఇస్తుండగా సొసైటీలు కూడా అదే మాదిరిగా ఇవ్వాల్సి వుండగా కొన్ని సొసైటీలలో తనఖా బాండ్లు మార్చకపోవడం వల్ల స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెరగడం లేదు.

- చుండ్రు రామ్మోహనరావు, రైతు, మండపాక

ఉగాది పురస్కారాలు

విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విశ్వావసు నామ సంవత్సర వేడుకలను ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా వివిధ రంగాలలో అత్యుత్తమ కృషి చేసిన కళాకారులకు కళారత్న, ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన పలువురికి సీఎం చంద్రబాబు నాయుడు పురస్కారాలు అందజేసి సత్కరించారు. పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.






ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా పురస్కారాలు అందుకుంటున్న ఇంద్రజాలికుడు డాక్టర్ బోస్(భీమవరం) శిల్పి శ్రీనివాస ఉడయార్ (తాడేపల్లిగూడెం) పద్య కవి, రచయిత రసరాజు (తణుకు) తెన్నేటి మాస్టారు (పాలకోడేరు)





ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఏలూరు గిరిజన భవన్‌లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉగాది వేడుకలను ప్రారంభించారు. భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



చిన్నారులతో కలెక్టర్ వెట్రిసెల్వి






భీమవరంలో జరిగిన ఉగాది వేడుకల్లో భాగంగా నృత్య కళాకారులతో కలెక్టర్ నాగరాణి సెల్ఫీ



ఏలూరులో జరిగిన వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనలు..



ఉమ్మడి పశ్చిమ గోదావరి పశు సంవర్ధక శాఖ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఏలూరులో నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ డాక్టర్ టి.గోవిందరాజు ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ఎలక్షన్ ఆఫీసర్ డాక్టర్ అనిత సమక్షంలో ఎన్నికను ఏకగ్రీవంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా భీమడోలు ఏడీ డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్, ఉపాధ్యక్షుడిగా జంగారెడ్డిగూడెం ఏవీహెచ్ డాక్టర్ దొరను ఎంపిక చేశారు. సహాయ కార్యదర్శిగా భీమవరం ఏవీహెచ్ డాక్టర్ సుధీర్, కోశాధికారిగా కొవ్వూరు ఏవీహెచ్ డాక్టర్ ఎ.వెంకటరెడ్డి,జాయింట్ కార్యదర్శిగా డాక్టర్ ప్రమీలారాణిని ఎంపిక చేశారు. జిల్లా పోలింగ్ ఆఫీసర్‌గా డాక్టర్ రూపకళ (ఏడీ) వ్యవహరించారు.

నిప్పుల గుండం



పాలకోడేరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పాలకోడేరు మండలం విస్సాకోడేరులో ఉగాది పురస్కరించుకుని గ్రామ దేవతలు వనువులమ్మ, మహంకాళి అమ్మ, వెంకమ్మ అమ్మవార్ల జాతర ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిప్పుల గుండం నిర్వహించారు. సుమారు 300 మంది భక్తులు నిప్పులగుండం తొక్కారు.




వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

తణుకు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తణుకులో శ్రీనివాసుడి కల్యాణం వైభవంగా జరిగింది. పట్టణంలోని నూలి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఉత్సవ విగ్రహాలతో శ్రీనివాసుని కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ఉగాది పురస్కరించుకుని డాక్టర్ శంకర్ శర్మ పంచాగం శ్రవణం చేశారు. ఎస్ఎన్‌వీటీ కళాశాల నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకొచ్చిన ఉత్సవ విగ్రహాలను ఎమ్మెల్యే రాధాకృష, కృష్ణతులసీ దంపతులు వేదిక వద్దకు తీసుకొచ్చారు. మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణం నిర్వహించారు. పద్మజ నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో శ్రీనివాస వైభవం నృత్య రూపకం అలరించింది. లావణ్య బృందం కీర్తనలు ఆకట్టుకున్నాయి. అంబికా డాన్స్ అకాడమీ విద్యార్థుల వినరో భాగ్యము విష్ణుకథ నృత్యాలు ఆకట్టుకున్నాయి.



కల్యాణం తిలకిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి దంపతులు



శ్రీనివాస వైభవం నృత్య రూపకం




చిన వెంకన్న ఆలయంలో ఉగాది పచ్చడి తీసుకుంటున్న భక్తులు

కిటకిటలాడిన ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పురస్కరించుకుని ద్వారకా తిరుమల చినవెంకన్న క్షేత్రం భక్తులతో కళకళలాడింది. ఆదివారం ఉదయం నుంచి భక్తుల రాకతో అన్ని విభాగాలు సందడిగా మారాయి. ఆలయానికి వచ్చిన వారికి దేవస్థానం తీర్థవినియోగ ప్రాంతంలో ఉగాది పచ్చడి అందించింది.

కుంకుళ్లమ్మకు ఐదు లక్షల గాజులతో అలంకరణ



క్షేత్రదేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్స వాలు ఆదివారం కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ఐదులక్షల గాజులతో అలంకరించారు. వచ్చేనెల 7 వరకూ జరుగనున్న ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారు గాజుల అలంకరణలో నిండు ముత్తైదు వులా భక్తులకు దర్శనమీయనున్నారు. వచ్చేనెల 7న ఆలయ ఆవరణలో కుంకుమపూజ తర్వాత చండీహోమం జరుగుతుందని ఆలయ అర్చకులు పుసులూరి భైరవస్వామి తెలిపారు.



మృతిచెందిన నాగేశ్వరరావు.. చికిత్స పొందుతున్న భార్య, పిల్లలు

ఆగి ఉన్న లారీని ఢీకొని ఒకరి మృతి

భార్య , పిల్లలకు గాయాలు

కొయ్యలగూడెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కొయ్యలగూడెం మండలం సీతంపేట సమీ పంలో ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో జంగారెడ్డిగూడెం లక్కవరం గ్రామానికి చెందిన వీర నాగేశ్వరరావు (45) మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నాగేశ్వరరావు లక్కవరంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆదివారం నాగేశ్వరరావు అతని భార్య రమణమ్మ, కుమార్తె జాహ్నవి, కుమారుడు షణ్ముఖ్ రెడ్డి నలుగురూ తమ ద్విచక్ర వాహనంపై లక్కవరం నుంచి రాజమండ్రి బంధువుల ఇంటికి బయలుదేరారు. కొయ్యలగూడెం మండలం సీతంపేట సమీపానికి చేరుకునేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో గాయపడ్డ వీరిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి తీసుకు వెళ్లగా చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతి చెందాడు. భార్య, పిల్లలను మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారు. మృతుడి కుమార్తె జాహ్నవి రాజమండ్రిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతుండగా, కుమారుడు షణ్ముఖ్ రెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

అదుపు తప్పిన వ్యాను



భీమవరం క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలోని విస్సాకోడేరు రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం ఒక వ్యాను అదుపు తప్పింది. భీమవరం వైపు నుంచి పాలకొల్లు వైపు వెళ్తున్న రొయ్యల వ్యాను వేగంగా వెళ్తూ అదుపు తప్పి పక్కనే ఉన్న బోదెలోకి దూసుకువెళ్లింది. అక్కడ సివిల్ సప్లయిస్ గొడౌన్‌కు సంబంధించిన ప్రహరీ గోడ ఉండటంతో ఆ గోడను తాకి ఆగింది.



పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు...విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

చీటీల ఆర్థిక లావాదేవీలే కారణం

వృద్ధురాలిని హతమార్చిన హంతకుడి అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలిని అతి కిరాతకంగా హతమార్చి, పెట్రోలు పోసి దగ్ధం చేసిన హంతకుడిని అరెస్టు చేసినట్టు జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాల యంలో ఆదివారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఏలూరు వెన్నవల్లిపేటకు చెందిన చనపతి రమణమ్మ (68) చీటీల వ్యాపారం చేస్తూంటుంది. 22 ఏళ్ళ క్రితం ఆమె భర్త మరణించాడు. ఆమెకు ఒక కుమార్తె ఉండగా సమీపంలో ఉంటున్నది. ఒంటరిగా జీవిస్తున్న రమణమ్మ వద్ద ఏలూరు సత్యనారాయణపేటకు చెందిన దూరపు బంధువు చనపతి దుర్గాప్రసాద్ (25) రెండు లక్షల రూపాయల చీటీ వేసి సొమ్ము తీసుకున్నాడు. వాయిదాల సొమ్ము 20 వేలు చెల్లించాల్సి ఉంది. రమణమ్మ అతని ఇంటికి పలుమార్లు వెళ్లి సొమ్ముకోసం అతనిని, అతని తల్లిని దుర్భాషలాడి అవమానపరిచింది. దీంతో రమణమ్మపై పగ పెంచుకున్న దుర్గాప్రసాద్ ఆమెను హతమార్చాలనుకున్నాడు. ఆమెకు సొమ్ములు ఇస్తానని చెప్పి ఈనెల 27వ తేదీ రాత్రి 9.30 గంటలకు ఆమె ఇంటికి వెళ్ళాడు. తనతో తెచ్చుకున్న నైలాన్‌తో మెడ బిగించి హతమార్చాడు. నోట్లో కాటన్ చీర కుక్కేశాడు. కాళ్ళు, చేతులకు తాళ్ళు కట్టేసి ఆమె మెడలో ఉన్న బంగారపు గొలుసు, చెవి దిద్దులు, మాటీలు, రెండు వేల రూపాయల నగదు అపహరించి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో రెండు కూల్ డ్రింక్ బాటిల్స్‌లో పెట్రోల్ పోయించుకుని సుమారు 2.30 గంటల సమయంలో రమణమ్మ ఇంట్లోకి వెళ్లి ఆమెపై, మంచంపై, టీవీ, ఏసీపై పెట్రోలు పోసి అంటించి పారిపోయాడు. ఇంటి నుంచి పొగలు రావడంతో ఇంటి ఎదురుగా ఉన్న యువకుడు బయటకు వచ్చి చూసి అల్లుడికి సమాచారం ఇచ్చాడు. ఈ సంఘటనపై క్లూస్ టీమ్‌లను, మంగళగిరి నుంచి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు పర్యవేక్షణలో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, భీమడోలు సీఐ విల్సన్, స్పెషల్ బ్రాంచ్ సీఐ బోణం ఆది ప్రసాద్, ఎస్ఐలు నాగబాబు,షేక్ మదీనా బాషా సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. ఆదివారం ఉదయం 11 గంటలకు పంపుల చెరువు వద్ద మోటారు సైకిల్‌పై వెళ్తున్న చనపతి దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతని నుంచి బంగారు ఆభరణాలు, మోటారు సైకిల్, వెయ్యి రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఏలూరు జైలులో మహిళా రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

ఇద్దరు మహిళా ఉద్యోగుల సస్పెన్షన్

విచారణ చేపట్టిన ఏలూరు ఆర్డీవో



శాంతకుమారి (ఫైల్ ఫొటో)



ఏలూరులో జిల్లా జైలు



మృతురాలి తల్లి, బంధువులతో మాట్లాడుతున్న ఆర్డీవో అచ్యుత్ అంబరీష్

ఏలూరు క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రియుడితో కలిసి భర్తను హత్య చేశారనే ఆరోపణపై అరెస్టు అయి రిమాండ్ ఖైదీగా జిల్లా జైలులో ఉన్న ఒక మహిళ తాను ఉన్న బ్యారెక్ కిటికీకి చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందింది. ఈ సంఘటన జిల్లా కేంద్రమైన ఏలూరులో తీవ్ర కలకలం కలిగించింది. పోలీసులు, మృతు రాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి మండలం తాటి ఆకులగూడేనికి చెందిన గంధం శాంతకుమారి (31)కి భర్త బోసు, కుమార్తె ఆరాధ్య (10), కుమారుడు అనూప్ శక్తి అలియాస్ చర్రీ (12) ఉన్నారు. శాంతకుమారి తన ప్రియుడు సొంగా గోపాలరావుతో కలిసి భర్తను హతమార్చారనే ఆరోప ణపై మార్చి 24వ తేదీన అరెస్టు అయి రిమాండ్ ఖైదీగా ఏలూరు జిల్లా జైలులో ఉంటున్నది. మహిళా బ్యారక్‌లో ఉంటున్న శాంతకుమారి ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో అందరూ టిఫిన్ చేయ డానికి బయటకు వచ్చారు. బయటకు వచ్చిన శాంతకుమారి తిరిగి వాష్‌రూమ్‌కు వెళ్తున్నానని చెప్పి బ్యారక్ వద్దకు వెళ్లిపో యింది. అక్కడ ఉన్న డ్యూటీ మహిళా కానిస్టేబుల్ 7.50 నిముషాలకు వెళ్ళి చూసేటప్పటికి బ్యారక్ కిటికీకి తన చున్నీతో ఉరి వేసుకుని వేలాడబడుతూ కనిపించింది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అప్ప టికే ఆమె మృతి చెందిందని వైద్యులు ధృవీ కరించారు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. జైలు సూపరింటెండెంట్ స్వామి ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఈ సంఘటనపై ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్య నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, ఏలూరు తహసీల్దార్ శేషగిరి జిల్లా జైలును పరిశీలించారు. ప్రభుత్వాసుపత్రి వద్దకు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి, బంధువులతో ఆర్డీవో మాట్లాడారు. సోమవారం ఉదయం శాంత కుమారి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

హెడ్ వార్డర్, వార్డర్ సస్పెన్షన్

జిల్లా జైలులో విధి నిర్వహణలో ఉన్న హెడ్‌వార్డర్ ఎల్.వరలక్ష్మి, వార్డర్ నాగమణిలు నిర్లక్ష్యంగా విధులు నిర్వహించడంతోనే రిమాండ్ ఖైదీ శాంతకుమారి ఉరి వేసుకోవడానికి ఆస్కారం ఏర్పడిందని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిద్దరిని విధుల్లో నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్‌వీ స్వామి ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

పిల్లలకు న్యాయం చేయండి

మృతురాలి తల్లి వేడుకోలు

తన అల్లుడు బోసు, కుమార్తె శాంతకుమారి చిన్నచిన్న గొడవలు పడేవారని తన కూతురు అమాయకురాలని తన అల్లుడిని చంపేంత ధైర్యం తన కుమార్తెకు లేదని అన్యాయంగా కేసులో ఇరికించారన్నారు.తన కుమార్తెకు ఇద్దరు పిల్లలు ఉన్నారని వారిద్దరికి న్యాయం చేయాలని ఆమె కోరారు. శాంతకుమారిని అక్రమంగా కేసులో ఇరికించారని జీలుగుమిల్లి పోలీసుల వేధింపుల భరించలేక ఆమె అవమానపడి ఆత్మహత్యకు పాల్పడిందని ఎమ్మార్పీఎస్ నాయకుడు కందుల రమేష్ అన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు..నలుగురికి గాయాలు

ఏలూరు క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో అతి వేగంగా వెళ్తున్న ఒక కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఆ కారులో ఉన్న నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. హైదరాబాద్‌నకు చెందిన సాయి కృష్ణ, ఆయన భార్య అనూష, కుమారుడు విరాజ్‌కృష్ణ, ఆయన తండ్రి వెంకట్రావు, తల్లి కలిసి సొంత కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన అమలాపురం సమీ పంలోని ములకాలగడ్డకు వస్తున్నారు. ఆదివారం ఉదయం ఏలూరు మెయిన్ బైపాస్‌లో కారు వెళ్తుండగా ముందు వెళ్తున్న ప్రైవేటు బస్సును తప్పించబోయి కుడివైపుకు వెళ్ళి డివైడర్‌ను ఢీకొని ఎదురు రోడ్డును కూడా దాటి సర్వీసు రోడ్డులోకి కారు వెళ్లిపోయింది. కారులో ఉన్న నలుగురు తీవ్ర గాయాలకు గురికాగా, అనూష పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు సూచించడంతో ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఏలూరు త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





గాయాలకు గురైన బాలుడు, మహిళ

రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు

నరసాపురం టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సోమవారం రంజాన్ పండుగను పురస్కరించుకుని మిషన్ హైస్కూల్ రోడ్‌లోని ఈద్గాను ముస్లిం సోదరులు ముస్తాబు చేశారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసేం దుకు భారీ టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. పంజా సెంటర్, పీచుపాలెం, పాతబజార్‌లోని మసీదులను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

మేధాశక్తి పెంపునకు చదరంగం దోహదం

ఆకివీడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మేధాశక్తి పెంపునకు చదరంగం దోహదపడుతుందని నిర్వాహకుడు కొండ్రు నరేష్ అన్నారు. పట్టణ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఆదివారం స్థానిక శారద ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సిబ్బంది పవన్, వెంకటేశ్వరరావు ఉన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఆదర్శ పట్టణంగా పాలకొల్లు : మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పాలకొల్లును ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతానని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలోని 27, 28, 1, 8 వార్డుల్లో రూ. 76 లక్షలతో చేపట్టే సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు ఆదివారం మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజకీయం అంటే సంక్షేమం, సేవ అని కూటమి నాయకుల భావన అని, వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని గుండాయిజానికి పాల్పడ్డారని, వారికి సమాజంలో తిరగడానికి అర్హత లేదన్నారు. గతంలో 80 శాతం పూర్తయిన కళాక్షేత్రం, హిందూ శ్మశాన వాటిక, ఉద్యానవనం వంటి పలు అభివృద్ధి పనులు వైసీపీ ప్రభుత్వంలో విధ్వంసానికి గురయ్యాయన్నారు. ఆగిన పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. కమీషనర్ బి విజయసారథి, డీఈ రాజ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆశలు నెరవేరాలి : ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరంటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు క్యాంప్ కార్యాలయంలో పండితులు యామిజాల కృష్ణ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రజలందరి ఆకాంక్షలు నెరవేరాలని కోరుకుంటున్నానన్నారు. కూటమి నాయకులు, పాల్గొన్నారు.

వనమాల శ్రీనుకు విప్ సత్కారం



నరసాపురం టౌన్, మార్చి 30(ఆంధ్ర జ్యోతి): ఇటీవల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన వనమాల శ్రీనును ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ఆదివారం సత్కరించారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వారికి పథకాలు అందేలా తనవంతు కృషి చేస్తామని నాయకర్ శ్రీనివాస్‌కు హామీ ఇచ్చారు. వరలక్ష్మి, శంకర్, భాస్కర్, సుధీర్‌కుమార్, కనకరాజు, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు నిధుల విడుదలపై హర్షం

మొగల్తూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మొగల్తూరులోని పెన్మత్స రంగరాజా జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రూ.1.71 కోట్లు నిధులు మంజూరు చేయడం పట్ల మొగల్తూరు టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ మామిడిశెట్టి సత్యనారాయణ, బస్వాని ఏడుకొండలు, కవురు నాగేశ్వరరావు, మోకా విజయభాస్కరరావు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మొగల్తూరుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి నిధులు విడుదలకు కృషి చేయడం శుభ పరిణామం అన్నారు. తొలి ప్రాధాన్యతగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో ఉన్నత పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడం పట్ల ఉప ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

కవితల పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ

పాలకొల్లు అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యానికి, సంస్కృతికి వన్నె తేవాలన్న లక్ష్యంతో ఈ ఏడాది నుంచి ఉగాది కవితల పోటీలను ఏర్పాటు చేసినట్టు రసధుని సాహితీ సంస్థ అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు తెలిపారు. ఆదివారం రసధుని ఆధ్వర్యంలో ఉగాది కవితల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. ప్రథమ బహుమతి ఉన్నమట్ల ప్రేమ్ కుమార్, ద్వితీయ జవ్వాది దాశరథి శ్రీనివాస్, తృతీయ బహుమతి చిలుకూరి సూర్యప్రసాద్‌కు ప్రోత్సాహక బహుమతులు ఉప్పల వెంకటా చార్యులు, ఎన్‌కే నాగేశ్వరరావు, పొప్పొప్పు విజయలక్ష్మికి లభించాయి. ప్రధాన కార్యదర్శి జయ దుర్గారావు, కోశాధికారి యర్రంశెట్టి వెంకట రత్నం, మామిడి శెట్టి శ్రీనివాసరావు, కవులు పాల్గొన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కోట అనంత పద్మనాభ శర్మ పంచాంగ శ్రవణం గావించారు.



తాగునీటి సరఫరా ట్యాంకర్ బహూకరణ

పాలకోడేరు, మార్చి 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోరుకొల్లు సచివాలయానికి గ్రామ ప్రజల సౌకర్యార్థం మంతెన వెంకట ప్రహ్లాదరాజు చారిటబుల్ ట్రస్ట్ మంచినీటి సరఫరాకు ట్యాంకర్‌ను బహూకరించింది. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ మంతెన యోగేంద్ర కుమార్ (బాబు) మాట్లాడుతూ గ్రామంలోని నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్‌ను అందజేసినట్లు తెలిపారు. ఉప సర్పంచ్ సీహెచ్ఎస్ రామాంజనేయరాజు, మాజీ సర్పంచ్ మంతెన లక్ష్మీ నరసింహరాజు, పంచాయతీ కార్యదర్శి కె.సుజాత, వార్డు మెంబర్లు కె.భూలక్ష్మి, తాండ్ర ఆదినారాయణ తదితరులు ట్రస్ట్ సేవలను కొనియాడారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


దుస్తులు అందిస్తున్న పారిశ్రామికవేత్త వెంకట్రావు

ఆకివీడు, మార్చి 30(ఆంధ్ర జ్యోతి): మానవసేవే.. మాధవ సేవని పారిశ్రామికవేత్త చుండూరి వెంకట్రావు అన్నారు. జననీ సేవా సంస్థ ఆధ్వర్యంలో మాదివాడ యువత ఉగాది సందర్భంగా ఆదివారం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు చీరలు, లుంగీలు, కండువాలతో పాటు భోజనం అందజేశారు. మాదివాడలో 2013 నుంచి ప్రతి ఏటా ఉగాదినాడు జననీ సేవా సంస్థ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అడపా అబ్బులు, మోటుపల్లి శ్రీను, మోటుపల్లి నాగభూషణం, పోశంశెట్టి హరి, మోటుపల్లి రాజా, వక్కపట్ల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మృతదేహంతో ఆందోళన

తణుకు రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేల్పూరులో శనివారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కుడిపూడి శ్రీనివాసరావుది హత్యేనని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, దళిత మహాసభ నాయకుడు చింతపల్లి గురుప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి శ్రీనివాసరావు మృత దేహంతో వేల్పూరులోని మద్యం షాపు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ శ్రీనివాసరావు హత్యపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని, మద్యం షాపు లైసెన్స్‌ను రద్దు చేయాలని, మృతదేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతుడి భార్య కుమార్తెలతో పాటు ఇరగవరం జడ్పీటీసీ పంపన అంజిబాబు, తణుకు పరిసర ప్రాంతాల శెట్టిబలిజ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బ్లేడుతో దాడి చేసిన నిందితుడు?

భీమవరం క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భీమవరం పట్టణంలోని అమ్మిరాజు తోటలో నివాసం ఉంటున్న యర్రంశెట్టి మంగతాయారు అనే మహిళపై చైనా బ్లేడుతో దాడి చేసి బంగారం దోచుకువెళ్ళిన ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పట్టణానికి చెందిన ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీనిపై ఒకటి, రెండు రోజుల్లో కేసు వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు.


వివిధ రంగాల్లో ప్రతిభావంతులను సత్కరించిన దృశ్యం

సంతోషాల విశ్వావసు

భీమవరంలో ఘనంగా ఉగాది వేడుకలు.. అలరించిన నృత్యాలు.. పలువురికి సత్కారం

భీమవరంటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విష్ణు ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విశ్వావసు ఉగాది వేడుకలు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వండర్ కిడ్స్ పాఠశాల విద్యార్థుల భరతనాట్యం, భారతీయ విద్యా భవన్ పాలకొల్లు విద్యార్థుల శాస్త్రీయ నృత్యం, భీమవరంలోని శ్రీ చైతన్య స్కూల్, శ్రీ ఉమా కూచిపూడి నాట్య కళాక్షేత్రం కూచిపూడి నృత్యం, బార్డోలి స్కూల్ విద్యార్థులచే శివతాండవం సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆహూతులకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలుపుతూ, జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వేడుకల్లో జిల్లా నీటి సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ రాజు, జిల్లా దేవాదాయశాఖ అధికారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కళాకారులు, కవులు, విద్యార్థులు, చిన్నారులు, ప్రజలు పాల్గొన్నారు. కాగా కార్యక్రమంలో పలువురు కవులు, అర్చకులు, వేదపండితులు, సంఘ సేవకులు, కళాకారులను సత్కరించారు.




నరసాపురం, జగన్నాథపురంలో క్రైస్తవుల ఆందోళనలు

పాస్టర్ మృతిపై సీబీఐ విచారణ జరపాలి

నరసాపురం టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సీబీఐతో విచారణ చేయించాలని నియోజకవర్గంలోని పాస్టర్లు, క్రైస్తవ సోదరులు ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేశారు. పాస్టర్ రుబేన్, కెనడీ, ఆనందకుమార్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి చెంది వారం రోజుల గడిచినా కేసులో ఇంతవరకు మిస్టరీ వీడక పోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

తాడేపల్లిగూడెం రూరల్: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపట్ల తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో ఆదివారం రాత్రి క్రైస్తవ విశ్వాసులు శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్‌లు, విశ్వాసులు పాల్గొని పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి నిజాలు బయటపెట్టాలని కోరారు. సర్పంచ్ చంద్రిక, పాస్టర్ ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి: ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని అత్తిలి మండల యునైటెడ్ పాస్టర్స్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసులకు వినతిపత్రం సమర్పించారు. ర్యాలీలో మండలంలోని లూథరన్ సంఘాల పేరిష్ పాస్టర్స్, జీడీఎం సంఘాలు, బైబిల్ మిషను సంఘాలు, పెంతెకోస్తు, ఆర్సీఎం, సాల్వేషన్ ఆర్మీ, క్రీస్తు సంఘాలు పాల్గొన్నాయి.

ఆకివీడు: పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలంటూ పాస్టర్ జోసఫ్‌రాజు అన్నారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో కొవొత్తులతో నిరసనలు తెలిపి మాట్లాడారు. సీటీసీఎస్సీ ఆంధ్ర బాప్టిస్ట్ సెంటినరి టౌన్ చర్చి నేతలు, క్రైస్తువులు పాల్గొన్నారు.



ఆకివీడు, దగ్గులూరులో చలివేంద్రాల్ని ప్రారంభించిన దృశ్యం

చలివేంద్రాలు ప్రారంభం

ఆకివీడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడం పుణ్యకార్యమని సీఐ వి.జగదీశ్వరరావు అన్నారు. స్థానిక పొట్టిశ్రీరాముల విగ్రహం వద్ద ఆర్యవైశ్యులు ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాని ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. 20 ఏళ్లుగా దాతల సహకారంతో ఇక్కడ మజ్జిగ చలివేంద్రం నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, గుర్రం శ్రీనివాసరావు, ఈశ్వరరావు, ఓలేటి శ్రీను, సన్నిధి వెంకన్నబాబు, గుర్రం రాంబాబు, చుండూరు వెంకన్న, కాకరపర్తి మురళి పాల్గొన్నారు.


పాలకొల్లు రూరల్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం దోహదం చేస్తుందని మండల పరిషత్ ఫ్లోర్‌లీడర్ శాగా సత్యనారాయణ అన్నారు. దగ్గులూరులో మెయిన్‌రోడ్డు పక్కన అల్ మదీనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఫౌండేషన్ ఛైర్మెన్ షేక్ దర్గాను, సభ్యులను అభినందించారు. కూటమి నాయకులు వరదా ధనరాజు, అందే వీరభద్రుడు, రేపాక వెంకటేశ్వరరావు, కొమ్మని కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణాలు..

పాలకొల్లు అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ధాన్య దానం విశేష ఫలితాన్ని ఇస్తుందని శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ అభిషేక పండితులు భమిడిపాటి వెంకన్న అన్నారు. క్షీరారామంలో ఆదివారం ఆయన పంచాంగ శ్రవణం చేశారు. 500 మందికి పంచాంగాలను పంపిణీ చేశారు. ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పి వాసు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

తణుకు: తణుకు రామకృష్ణ సేవాసమితిలో ఆదివారం పంచాంగ కర్త పీసపాటి పాలశంకర వరప్రసాద సోమయాజి పంచాంగ పఠనం చేశారు. ముందుగా గోస్తనీ వంతెన వద్ద గల నన్నయ విగ్రహానికి పీఠం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు తంగిరాల బాల గోపాలకృష్ణ, డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు, న్యాయవాది సూరంపూడి కామేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఠంలో చిలుకూరి సత్యవతి దీపాలంకరణ చేసారు. నన్నయ చిత్రపటానికి భోగవల్లి శ్రీమన్నారాయణ, పోతాప్రగడ శ్రీరామారావు, డాక్టర్ జీవీస్వీ ప్రసాదు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ తాతిన రామబ్రహ్మం పుట్టిన రోజు సందర్భంగా పీఠం తరఫున సన్మానించారు. అనంతరం ఇటీవల పద్య పఠన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రాష్ట్రస్థాయి పద్య రచన పోటీల్లో గెలుపొందిన కవులకు బహుమతులు అందించారు.

మొగల్తూరు: ఆదివారం ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆలయ అర్చకులు అచ్యుతరామశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు. పంచాంగ శ్రవణం అనంతరం పండిత సత్కారాలను ఈవో, చైర్మన్ కడలి మాణిక్యాలరావు నిర్వహించారు.


క్షీరారామంలో పంచాంగ శ్రవణం

పోడూరు: పోడూరులోని ఆలయాల్లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. పంచాంగ శ్రవణం జరిగింది. పాలకొల్లు రూరల్ మండలం శివదేవునిచిక్కాలలోని శివదేవస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పూలపల్లి అమృతలింగేశ్వరస్వామి ఆలయంలో పంచాంగం శ్రవణం నిర్వహించి పంచాంగాలను పంపిణీ చేశారు.

ఆకివీడు: ఈ ఏడాది అంతా ప్రశాంతంగా ఉంటుందని, దేశ కీర్తి పెరుగుతుందని పంచాంగకర్త దోనేపూడి శ్రీకృష్ణపరమాత్మ అన్నారు. స్థానిక మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, పెద్దింట్లమ్మ ఆలయంతో పాటు ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో ఆదివారం పంచాంగ శ్రవణం జరిగింది. ప్రజల్లో దైవభక్తి పెరుగుతుందన్నారు.సూర్యదేవుని పూజించడం వలన ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పరిపాలన సాఫీగా ఉండడమే కాక, కేంద్రం నుంచి నిధులు పుష్కలంగా వస్తాయన్నారు. పంటలు బాగా పండుతాయి.. పరిశ్రమలు వస్తాయని, రియల్ ఎస్టేట్ ముందుకు వెళుతుందన్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు ప్రకృతి వైపరీత్యాలు ఉంటాయన్నారు. గ్రహణాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. సన్నిధి వెంకన్న, కిమిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


రంగసాయిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

40 ఏళ్లుగా వేడుకల నిర్వహణ భేష్

భీమవరం టౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు పండుగలు చిహ్నాలని కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. భీమవరం భీమేశ్వర స్వామి ఆలయంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించారు. ముందుగా కలశంతో మావుళ్ళమ్మ దేవస్థానం నుంచి శోభయాత్ర నిర్వ హించి భీమేశ్వరస్వామి దేవస్థానంకు చేరుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మన ప్రాచీన సంప్రదాయాలు కనుమరుగు అయ్యాయని, నేడు ఈ వేదికపై ఆనాటి ప్రాచీన కళలైన జంగం దేవర, పిట్టల దొర, కొమ్మ దాసరి, బుర్రకథ, ఇంద్రజాలం, భారత నాట్యం తదితర ప్రదర్శనలు ఎంతో ఆనందాన్ని ఇచ్చాయని, 40 ఏళ్లగా ఈ వేడుకలను సంప్రదా యంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతా రామలక్ష్మి, డీఎస్పీ జయసూర్య, భాను నాయక్ మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలు లలిత కళలతోనే ముడిపడి ఉన్నాయని, విశిష్ట సేవలు చేసిన వారికి సమాజంలో ఎప్పుడు గుర్తింపు ఉంటుందని అన్నారు. నిర్వహణ కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 40 ఏళ్లుగా అందరి సహకారంతో ఉగాది పురస్కా రాలను అందిస్తున్నామ న్నారు. 60 మందికి ఉగాది పురస్కారాలను అందించామని, 50 మంది విద్యార్థుల కు ప్రశంసా పత్రాలు అందించామని తెలిపారు. అనంతరం మెజీషియన్ వి. రఘుకు సువర్ణ కంకణం అందించి సత్కరించారు.



రంజాన్ కిట్ల పంపిణీ

తణుకు రూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తణుకు నియోజకర్గంలో ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తన సొంత నిధులతో సమకూర్చిన రంజాన్ తోఫాను ఆదివారం వేల్పూరు, దువ్వ, తేతలి, మండపాక, ముద్దాపురం, కోనాల, కొమరవరం తదితర గ్రామాల్లోని ముస్లిం కుటుంబాలకు ఆయా గ్రామాలకు చెందిన కూటమి నాయకులు పంపిణీ చేశారు.

ఇంటర్వ్యూ..

సారా నిషేధానికి కమిటీలు

రాంబాబు, ఎక్సైజ్ సీఐ



- **సర్కిల్ పరిధిలో ఎన్ని గ్రామాల్లో సారా తయారీ అనుమానిత గ్రామాలు ఉన్నాయి?**

జవాబు: మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లి పరిధిలోని కట్టావారిమెరక, కుక్కలవారి తోట, రెండు నివాసిత ప్రాంతాలు గుర్తించాం

- **సారా తయారీ నియంత్రణకు చేపట్టిన చర్యలు?**

జవాబు: ఈ రెండు గ్రామాల్లో సర్పంచ్, వీఆర్వో, ఎక్సైజ్, మహిళా కానిస్టేబుళ్ళతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం.

- **కృష్ణా జిల్లా సరిహద్దు నుంచి సారా రవాణా అరికట్టేందుకు చేపడుతున్న చర్యలు?**

జవాబు: జిల్లా సరిహద్దు గ్రామాల్లో నిఘా పెంచాం. కృష్ణా జిల్లా ఎక్సైజ్ పోలీసులతో కలసి సారా నియంత్రణకు జాయింట్ ఆపరేషన్ చేయాలని నిర్ణయించాం.

(ఆంధ్రజ్యోతి-నరసాపురం)

పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఆచంట, మార్చి30(ఆంధ్రజ్యోతి): ఆది, సోమవారం రెండు రోజులు సెలవు దినాలు అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాలు మేరకు జిల్లాల్లో ఆదివారం అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పని చేశాయి. ఆచంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మూడు రిజిస్ట్రేషన్‌లు జరగ్గా జిల్లాలో సుమారు 50 పైగానే జరిగినట్లు సమాచారం.త


యశస్విని సత్కరిస్తున్న పురందేశ్వరి

యశస్వినికి సత్కారం

తణుకు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఉగాది ఉత్సవంలో షణ్ముఖి యశస్విని కామ్య కూచిపూడి నృత్యం పలువురు ఆకట్టుకుంది. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కామ్యను సత్కరించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


రంగరాజును సత్కరిస్తున్న దృశ్యం

రచయిత రంగరాజుకు సత్కారం

ఉండి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని విభిన్న రంగాల్లో ప్రతిభావంతులకు పురస్కారాలు అందిస్తున్నట్టు గ్రామస్థులు ఏ.ఆనంద, గుడాబత్తుల సుబ్బారావు అన్నారు. ఆదివారం ఉండి రామాలయంలో ఉగాదిని పురస్కరించుకుని రచయిత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రంగరాజును ఘనంగా సన్మానించారు. ఈ ఏడాది నుంచి ఒకరిని ఎంపిక చేసి సన్మానించాలని తలపెట్టినట్టు తెలిపారు. ముదునూరి గోపాలరాజు, రామకృష్ణారావు, వెంకటాచార్యులు, కామేశ్వరి పాల్గొన్నారు.

నేడు కోట సత్తెమ్మ ఆలయం ప్రారంభం

పాలకొల్లు రూరల్, మార్చి 30(ఆంధ్ర జ్యోతి): పాలకొల్లు రూరల్ పంచాయతీ పరిధిలో హనుమాన్ నగర్‌లో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన కోట సత్తెమ్మ ఆలయం సోమవారం ప్రారంభించ నున్నారు. దాసిరెడ్డి శ్రీను దంపతులు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు శ్రీవినాయక, ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ తెలిపింది.

ఆధ్యాత్మికం

కిటకిటలాడిన ఆలయాలు

నరసాపురం టౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గమ్మ, వనువులమ్మ, గోగులమ్మ, దుర్గాభవాని, కొండాలమ్మ, పుంతలో ముసలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామోత్సవాలు నిర్వహించారు. తీన్‌మార్, గరగన్రుత్యాలు, బాణసంచా కాల్చుతూ ముందుకుసాగారు.

తణుకు: పుంతలో ముసలమ్మ వారిని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దర్శించుకున్నారు. ఆలయాల వద్ద పంచాంగ శ్రవణం జరిగింది. ఉగాది పచ్చడితో పాటు ప్రసాదం అందజేశారు.

పెంటపాడు: పెంటపాడు పుంతలమ్మ ముసలమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మేళతాళాలు, తీన్‌మార్ డప్పులు, గరగన్రుత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కే.పెంటపాడు భైరాగిమఠం గోపాలస్వామి ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ ఫిట్‌పర్సన్ బీవీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచాగ శ్రవణం జరిగింది.

ముఖదారమ్మకు భారీ సూత్రాల హారం



పాలకొల్లు అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక అచ్చుగట్లపాలెంలోని శ్రీ ముఖదారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం ఉదయం ప్రారంభమయ్యాయి. జాతర ఉత్సవాలు వారం రోజుల పాటు జరగనున్నాయి. ఈసందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో వివిధరకాల పూలతో అలంకరించారు. భక్తులు అందజేసిన 23 కాసుల బంగారంతో అమ్మవారికి సూత్రాల తాడును తయారు చేయించి, సంప్రోక్షణాది కార్యక్రమాల అనంతరం అమ్మవారికి అలంకరించారు. బాణాసంచా కాల్పులు, గరగ నృత్యాలు, మేళతాళాలతో అమ్మవారి జాతర నిర్వహించారు. అలాగే 12వ వార్డులోని శ్రీ కొండాలమ్మ ఆలయం వద్ద అమ్మవారి జాతర, కటికల వారి వీధిలో పుంతల ముసలమ్మ అమ్మవారు, రంగమన్నారు పేటలోని శ్రీపుంతల ముసలమ్మ అమ్మవార్ల జాతరలు ఆదివారం ప్రారంభం అయ్యాయి.

మొగల్తూరు: శేరేపాలెం, కెపిపాలెం, మొగల్తూరుల్లోని పుంతలో ముసలమ్మ, రామన్న పాలెంలో ముత్యాలమ్మ వారి జాతర ఆదివారం రాత్రి భారీ బాణా సంచాకాల్పులతో, తీన్‌మార్ వాయిద్యాలు, విచిత్ర వేషధారణలతో అమ్మవార్లను ఊరేగించారు. చెట్టుకింద ముత్యా లమ్మ జాతర ముగింపు సందర్భంగా మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవార్లను మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు దర్శించుకుని పూజలు చేశారు.

పెనుమంట్ర: మాముడూరులో పార్వతీ సమేత జగదీశ్వర స్వామి కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్లను రథంపై ఊరేగించారు. రథం పైకి అరటి పళ్ళు విసిరారు. రథంలో పళ్ళు పడితే కోరిన కోరికలు తీర తా యని భక్తులు విశ్వాసం.

దేవతామూర్తులపై సూర్యకిరణాలు

పెనుమంట్ర: ఉగాది రోజున సూర్యోదయం సమయం లో సుప్రసిద్ధ శైవక్షేత్రంజుత్తిగ లో శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం లో సూర్య నారాయణ మూర్తి , సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలను సూర్యకిరణాలు తాకడంతో భక్తులు వీక్షించి తన్మయత్వం చెందారు. ఇటీవల దేవత మూర్తుల విగ్రహాలుపై సూర్యకిరణాలు ప్రసరించగా ఉగాది రోజున మరలా 2వ సారి పడటంతో భక్తులు దర్శనం చేసుకున్నారు.

పెనుగొండ: సిద్ధాంతంలో సత్తెమ్మ జాతర ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. చింతలపాలెం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గరగల నృత్యాలు, సన్నాయి మేళాలు ఆకర్షించాయి.

ఉండి: ప్రజలందరినీ వీరపేరంటాలమ్మ ఆశీర్వదించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు ఆకాంక్షించారు. ఆదివారం వెలివర్రులోని వీరపేరంటాలమ్మ ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజించారు. జనసేన ఇన్‌చార్జు జుత్తుగ నాగరాజు, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహకకార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ గాదిరాజు వెంకటరాజు, సర్పంచ్ అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.


వీరపేరంటాలమ్మకు మంతెన పూజలు